

## కొడవటిగంటి కుటుంబరావు

# కొత్త డిటెక్టివ్ ప్రవేశం

ఏ క్షణాన ఏం జరిగేదీ చెప్పలేం గదా! కిందటేడు ఈ రోజుల్లో నేను సినిమా తారణ్ణి కావాలనే కృషి చేస్తున్నాను. ఇప్పుడు ఆ సంగతి తల్చుకుంటే నాకే హాశ్చర్యం వేస్తుంది. సినిమాల్లో చేరాలని ఉబలాట పడేవాళ్ళు మరీ చిన్న పిల్లల్లాంటి వాళ్ళు. కాని నేను అలా ఉబలాటపడిన వాడినే మరి. అహోరాత్రుళ్ళు నిద్ర లేకుండా గడిపాను. ఎంత మందికి ఉత్తరాలు రాశానో జ్ఞాపకం లేదు. హీరో నాగేశ్వరరావుకి రాశాను -

."అయ్యా నాగేశ్వర్రావుగారూ, నువ్వు యెంత ఇదిగా యాక్టుచేయుదువో, నేను అంతకంటే బాగా చేయుదును. నీకంటె నాకు వర్చస్సు ఇంకా యెక్కువ బాగా యుండునని నా మిత్రులు చెప్పుచున్నారు. కనుక ఈ కొత్త నటునియందు దయవుంచి నాకొక ఛాన్సు ఇప్పించవలెను. నీవు గొప్ప నటుడవై గర్వాంధకారమత్తుడవై నాకు ఛాన్సు ఇప్పించకున్నను నేను యెప్పటికైన పైకి రాగలవాడను. కనుక తీరిక చేసుకుని ఇప్పించేది. నీ ఉత్తరమునకు వెయ్యి కళ్ళతో యెదురుచూచుచుండెదను.

ఇట్లు
ఆనంద్

ఇదే విధంగా యెంటీ రామారావుకూ, నాగయ్యకూ, భరణీ రామకృష్ణకూ ఇంకా మిగిలిన వాళ్ళకూ జవాబులు రాశాను. ఒక్కరూ సమాధానం రాయలేదు. ఇప్పుడు చెప్పితే తప్పేమిటి? ఒక రాత్రియంతా ఏడ్చాను...ఇప్పుడదియంతా అయిపోయింది. నేను పట్నం బయలుదేరాను. రైలు నన్ను పట్నానికి వాయువేగంతో తీసుకుపోతున్నది. నేను పోతున్నాను. ఎందుకో తెలుసా? సినీమాలలో యాక్టు చేయుటకు కాదు - డిటెక్టివ్ నగుటకు!

నా తలలో చాలా ఆలోచనలు ఉన్నాయిలెండి. వాటిని చేసి చూపించాలిసిందే. ఒక పెద్ద మేడ అద్దెకు తీసుకుని, మంచి కారుకొని.... అబ్బో, చాలా చెయ్యాలి. పట్నంలో దిగగానే తాపీగా కూచుని ఏమేం చెయ్యాలో రాసుకోవాలి. రాయటానికి కాస్త ఇంగ్లీషు వచ్చిన వాణ్ణి అసిస్టెంటుగా వేసుకోవాలి. అసలు డిటెక్టివ్‌కు అసిస్టెంటు లేకుండా యెలా?

"కాస్త అగ్గిపెట్టిప్పిస్తారూ?"

హులిక్కిపడ్డాను. రైలు కూతవేస్తూ పోతోంది. నా పక్క ఒక పొడుగాటి వాడు నిలిచి ఉన్నాడు. వాడి చేతిలో ఏదో ఉన్నది. పిస్తోలా? కాదు. పిస్తోలు కాల్చటానికి అగ్గిపెట్టి యెందుకు? ఆ - తెలిసింది. అది సిగిరెట్టు పెట్టి.

"ఏదీ ఒక సిగరెట్టు?" అన్నాను హుందాగా.

ఆ పొడుగాటి వాడు తన నోట్లో పెట్టుకున్న సిగిరెట్టు తీసి ఇచ్చాడు. నేను జేబులో నుంచి ఒకే నిప్పుపుల్లగల పెట్టి తీసి వాడిచ్చిన సిగిరెట్టు వెలిగించి పుల్ల, కిటికీలో నుంచి బయట పారేశాను.

"నాకేదీ పుల్ల?" అన్నాడు.

"ఉండవోయ్, అంజీ! నా దగ్గర కాలుతున్న సిగిరెట్టు లేదూ?" అన్నాడు.

"నా పేరు అంజికాదు."

"మరేమిటి?"

"భద్రయ్య - బసవాని భద్రయ్య"

"భద్రం...బాగానే ఉంది పేరు. నాకు అసిస్టెంటుగా ఉంటావ్?"

"అంటే?" అన్నాడు భద్రం. నేనిచ్చిన సిగిరెట్టే తను కూడా కాలుస్తూ

"నీది వొట్టి మట్టిబుర్రల్లే ఉంది. నేను పట్నం పోయి డిటెక్టివవుతాను. డిటెక్టివుకు అసిస్టెంటుండ వద్దా?"

"ఏమిస్తావు?"

నేను షాక్ తిన్నాను. ఇన్ని డిటెక్టివు పుస్తకాలు చదివానుగాని ఎక్కడా అసిస్టెంటు డబ్బడగటం చూడలేదు.

"నా అసిస్టెంటు గనక నా డబ్బంతా నీ దగ్గరే ఉంటుంది. నాకేమన్నా కావలిస్తే నువ్వే కొంటావు."

"నీ దగ్గిరెంతుందీ?"

"ఎంతుండటమేమిటి? రెండు వేలుంది. ప్రస్తుతానికి చాలదూ?"

"చాల్చాలు! కొల్ల!" అన్నాడు భద్రం సిగిరెట్టు బయటికి పారేస్తూ.

"చంపేశావు. ఆ సిగిరెట్టుతోనే ఇంకోటి అంటించాలి. అగ్గిపెట్టి అయిపోయింది," అన్నాను.


"అగ్గిపెట్టికేం భాగ్యం? రైలునిండా అగ్గిపెట్టిలే," అన్నాడు భద్రం. వాడు అట్లా పక్కకు వెళ్ళి క్షణంలో అగ్గిపెట్టి తెచ్చాడు. నాకు తగ్గ అసిస్టెంటే!

* * *

అదేం స్టేషను! అంత పెద్ద స్టేషను నేనెక్కడా చూడలా! అయితే నా ఆశ్చర్యం పైకి కనిపించనియ్యక భద్రంతో ఠీవిగా, "మనం ఇప్పుడేం చేద్దాం?" అన్నాను.

"బయటికి పోదాం," అన్నాడు వాడు.

"సరే పద," అంటూ వాడి వెంట బయ



డిటెక్టివ్ సాహిత్యం ఈనాడు కొత్తగా రాలేదు. యాబై ఏళ్ళ క్రితం కూడా డిటెక్టివ్ నవలలు - బెంగాలీ నవలలకు తెలుగు అనువాదాలు - లైబ్రరీలలో దొరికేవి. నేను నా చిన్నతనంలో మూడు నాలుగు నవలలు చదివి ఆనందించాను కూడా.

అయితే సుమారు పది సంవత్సరాల కింద తెలుగులో డిటెక్టివ్ నవల అనేది ఎపిడెమిక్ ఫామ్ పొందింది. వీటిలో చాలా భాగం సొంత రచనలూ కావు, ఆనెస్ట్‌గా అనువాదాలూ కావు. డిటెక్టివు నవలలకు డిమాండు నానాటికీ హెచ్చుతూ ఉండటం చూసి, తెలుగు సరిగా రాని వాళ్ళూ, రచన చెయ్యటం చాతకాని వాళ్ళూ, డిటెక్షను ఒక సైన్సని తెలియని వాళ్ళూ 'చెత్త' దించసాగారు.

ఈ 'చెత్త'ను పారడీ చెయ్యాలన్న కోరిక ప్రబలం అయేసరికి 'కేయాస్' కథలను ప్రారంభించాను. 'సినిమా పిచ్చి' గల వాళ్ళను నిత్యమూ చూస్తూనే ఉండటం చేత వాళ్ళ పంపిణీ మీద కేయాస్'ను 'డిటెక్టివ్ పిచ్చి'గల వాణ్ణిగా సృష్టించాను. 'కేయాస్' కథలు రాయటంలో నేను పెట్టుకున్న లక్ష్యం పూర్తిగా విఫలమయిందనటానికి రెండు రకాల నిదర్శనాలు కనిపించాయి. ఈ కథలను చదివిన కొందరు పఠితలు, ఇందులో డిటెక్షను సరిగా లేదని ఆక్షేపించారు! అంతకన్న దారుణమైనదేమంటే, నేను రాసిన ఘోరమైన పారడీలకన్నా ఘోరతరమైన డిటెక్టివు నవలలు వెలువడి వేనకు వేలుగా అమ్మాయి. ఇంతఅపజయం నేనెన్నడూ ఎరగను. వీటిని నేను టి.వి.శంకరమ్ అనే పేరుతో రాయటం కొంత మెరుగైంది. మిగిలిన 'కేయాస్' కథలు గాలికి కొట్టుకుపోయినా - 'కేయాస్'ను పరిచయం చేసే ఈ కథకు సాహిత్యంలోచోటుండకపోదనినానమ్మకం.

-కొడవటిగంటి కుటుంబరావు

లుదేరాను.

కొంతదూరం వెళ్ళేసరికి మాకొక పుస్తకాల షాపు కనిపించింది. వెంటనే నా నడక ఆగిపోయింది. భద్రం కూడా ఆగి పుస్తకాల దగ్గరికి నడిచాడు. మేమిద్దరమూ పుస్తకాలను చూడటం మొదలుపెట్టాం.

"పరమాణువుతో పరిచయం', 'విశ్వవిజ్ఞానం', 'విజ్ఞాన కర దీపిక' - అబ్బో, ఎన్ని మంచి పుస్తకాలో! 'గోపీచందు కథలు', 'కుటుంబరావు కథలు,' 'కథా సముద్రం' - అబ్బో, సాహిత్యం," అంటూ భద్రం ఒకటే చదువుతున్నాడు.

"అవునవును!" అంటూ గబగబా కొన్ని పుస్తకాలు ఏరుకున్నాను. "దయ్యం రాచుకున్న సెంటు," "తలలేని మొండెం," "పిస్తోలు పిలుపు," "అంధకారంలో ఆర్తనాదం" మొదలయిన పుస్తకాలు కొని డబ్బిచ్చేశాను.

"...ర్యచ్ఛక్తితో వినోదాలు' వద్దా?" అన్నాడు భద్రం.

"వద్దు, బుర్ర షాక్ తింటుంది" అన్నాను.

"సరే అయితే."

ఇద్దరం బయటికి వచ్చాం. అవేం కార్లు! అవేం బస్సులు!

ప్రపంచంలో ఉన్న కార్లూ, బస్సులూ అన్నీ ఈ పట్నం స్టేషన్ దగ్గిరికే వచ్చినట్టుంది!

"దాటాలి" అన్నాడు భద్రం రోడ్డు కడ్డంపడి. మరుక్షణం నేను చచ్చినంత పని అయింది.

"ఆ కారు నెంబరు గమనించావా? నేను వస్తున్నానని ఈ వూళ్ళో డిటెక్టివు ఎవడో పసికట్టి నన్ను హత్య చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ కారు నెంబరు ఎంత?" అన్నాను భద్రంతో.

"ఆ కారుకు నెంబరు లేదు" అన్నాడు భ...

నేను షాక్ తిన్నాను. కార్లకు నెంబరుండకపోవటమేమిటి?" ఏ పుస్తకంలోనూ చదవలేదే?

"అది గవర్నరుగారికారు" అన్నాడు భద్రం.

"గవర్నరుగారి బంధువుల్లో డిటెక్టివు ఎవరన్నా ఉన్నాడా?" అన్నాను.

భద్రం నాకేసి ఒక రకంగా చూసి జవాబు చెప్పలేదు. నా అసిస్టెంటు నా కేసి అట్టా చూడటం నా కెందుకో నచ్చలేదు. కాని ఇప్పుడే వాణ్ణి కోప్పడటం బాగుండదు. తరవాత మెల్లిగా చెబుతా.

భద్రం నన్నొక బస్సు ఎక్కించాడు.

"ఇదేమిటి? మనం టాక్సీలో పోవటం లేదా?" అన్నాను.

"మనం పుస్తకాల దగ్గిర ఆలస్యం చేశాం. టాక్సీలన్నీ పోయాయి."

"మనం ఎక్కడికి పోతున్నాం?"

"హోటల్ దాసప్రకాశ్."

"అది నోరు తిరగలేదే."

దారిలో భద్రం గురించి కొన్ని వివరాలు తెలుసుకున్నా. వాడు మద్రాసుకు పాతవాడే. సినిమాల్లో చేరదామని వచ్చి, అయిదేళ్ళుగా ఉంటున్నాట్ట. సినీమా తారల కారు నెంబర్లన్నీ చెప్పాడు. కార్ల పేర్లు చెప్పాడు.

"అబ్బీ, నువ్విక సినీమాల భ్రమ వదులుకో. సినీమాల యుగం అయిపోయింది. డిటెక్టివుల యుగం వచ్చింది. సినీమాలు చూసేవాళ్ళకన్న డిటెక్టివ్‌లు చదివేవాళ్ళెక్కువ. సినీమాలు రాసేవాళ్ళకన్న డిటెక్టివ్‌లు రాసేవాళ్ళెక్కువ" అని భద్రంతో అన్నా.

భద్రం జవాబు చెప్పలేదు. వాడు కొంచెం ఆలోచించి, "నాకు సినీమా ఛాన్సు వస్తే మాత్రం నీ వెంట ఉండను" అన్నాడు. అంత కృతఘ్నుడిని నేనెక్కడా చూడలేదు.



***

అద్భుతం! అమోహం! ఇటువంటి హోటలు ప్రపంచంలో ఎక్కడా లేదని ఢంకా మీద కొట్టి చెప్పగలను.

"భద్రం, డిటెక్టివులు ఇటువంటి హోటళ్ళుండగా ఇళ్ళలో ఎందుకుంటారూ?" అని అడిగాను.

"వాళ్ళ మొహం!" అన్నాడు భద్రం.

"ఈ గదిలో టెలిఫోనుంది చూశావా? దానిమీద మాట్లాడడం నీకు చాతవునా?"

"ఎవరితో మాట్లాడాలి?"

"ఎవరితోనా? ఆ టెలిఫోన్‌కు ఇంక నిద్దరాహారాలుంటయ్యా? మనం వచ్చాంగా? ఎవరన్నా చచ్చారనుకో, టెలిఫోన్ మోగుతుంది. ఇన్‌స్పెక్టర్లు డిటెక్టివ్ కే యాస్ ఆనంద్‌గారి కోసం అడుగుతారు."

భద్రం పిచ్చిమొహం వేసి, "కే-?" అన్నాడు.

"యాస్! యాస్! కే యాస్! అర్థం కాలేదా? నా పేరు పొడి అక్షరాలు. కే యాస్ ఆనంద్ అంటే ఎవరో అనుకుంటున్నావల్లే ఉంది - నేనే!"

"ఓ!" అన్నాడు భద్రం.

"చూడు, భద్రం! కాగితం కలం తీసుకో. జాబితా రాయాలి. అన్నిటికన్న ముఖ్యంగా కావలసింది కారు."

"ఏం కారు?"

"పోంటాక్, క్రిస్లర్, స్టుడిబీకర్ - కాస్త చౌకలో ఏదో ఒకటి."

"ఎందుకూ?"

"భద్రం, నీక్కొంచెమన్నా బుద్ధి లేదు. సబ్బుగాని, సర్కిల్‌గాని టెలిఫోన్‌లో ఒక స్త్రీ శవం మాయమయిందని చెబితే, ఎక్కడ మాయమయిందో చూడటానికి బస్సులో పోతామా?"

నేనింకా ఈ మాట అన్నానో లేదో అంబ పలికినట్టు టెలిఫోన్ మోగింది. మా గది టెలిఫోన్ కాదు, మా పక్క గదిలోది. నేను గబగబా పక్క గదికి పరిగెత్తి, టెలిఫోన్ ఎత్తి, "సదా ప్రసాద్ హోటలు నుంచి డిటెక్టివ్ కే యాస్ మాట్లాడుతున్నాను. ఎవరు పోయారూ?" అని గబగబా అడిగేశాను.

మరుక్షణం బరువుగా నా భుజం మీద చెయ్యి పడ్డది. ఆశ్చర్యం! నాకన్న మూరెడున్నాడు. ఐదారు హత్యలన్నా చేసి వుంటాడు. డిటెక్టివును ఆ మాత్రం తెలుసుకోలేనా?

"గెటౌట్!" అన్నాడు, నా చేతిలోంచి టెలిఫోన్ లాక్కుంటూ.

"కారు రాసుకున్నావా భద్రం?" అంటూ నా గదిలోకి మళ్లీ అడుగుపెట్టాను.

"ఏం కారో సరిగా చెప్పలేదే?"

"'పెట్టెలో శవం'లో డిటెక్టివు ఏం కారు వాడతాడో, చూసి అదే రాసుకో, నన్ను చంపక, రాసుకో, ఒక పిస్తోలు."

"పిస్తోలా, రివాల్వరా?"

"ఏది చవకైతే అది కొందాం. రాసుకో - టార్చిలైటు, టేపు, ప్లాస్కు, కెమెరా, హ్యాండ్‌బ్యాగ్, టేప్‌రికార్డు...అసల్ది మర్చాం. ఈ వినింగ్ హ్యాట్, పేటెంటు లెదరు చెప్పులు, భద్రం, నేను సూటేసుకుంటే ఎట్టా ఉంటాను?"

"మోత!"

"రాసుకో,ఒక సూటు...భద్రం! మెట్లమీద అడుగుల చప్పుడు విను. ఎవరో వస్తున్నారు! భయంకర దారుణ హత్య! హంతకుడెవడు? పోలీసులకు తెలీదు! వట్టి చవటలు, డిటెక్టివు పుస్తకాలు రాకపోతే వాళ్ల వల్ల ఏమీ అయి వుండేది కాదు. భద్రం, ఎవరూ రాలేదేం?"

"ఇంకో గది కెళ్ళారు."

"ఈ హోటల్లో ఇంకో డిటెక్టివున్నాడంటావా?"

"అది మనం కనిపెట్టాలి."

"రైట్, బాగా చెప్పావు. భద్రం, మనం కొన్నది పత్రికా, ప్రభా?"

"ఏదీ కొనలేదు. హిందూ కొన్నా."

"ఇంగిలీషుదెందుకొన్నావ్? చూడు భద్రం,వెంటనే వెళ్ళి తెలుగు పత్రిక పట్రా. పత్రికలో ఎక్కువ హత్యలుంటయ్యంటావా, ప్రభలోనా?"

"హిందూలో చూడగూడదూ?"

"అయితే పదివేల కాపీ లమ్మేదిగా చూసి ఒక మంచి హత్య ఒకటి చదువూ!"

"ఒక ఆడమనిషి రైలుకిందపడి చచ్చింది."

"డ్రైవరు పేరు?"

"ఇందులో లేదు."

"సొమ్ములేమైనా పోయాయా?"

"అదీ రాయలేదు."

"ఛత్, ఇంకో హత్య చూడు."

"దారిద్ర్యం భరించలేక ఒక కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్నారు."

"ఎంతమంది?"

"అయిదుగురు."

"ఎట్లా చచ్చారు?"

"పిల్లల్ని బావిలోకి తోసి, తల్లిదండ్రులు ఉరేసుకున్నారు."

"వొండ్రుఫుల్! ఇది ఆత్మహత్యకాదు. హత్యే! ఘోర క్రూర హత్య. దీని వెనక హంతకులెవరో ఉన్నారు. డిటెక్టివ్ కే యాస్ హత్యా రహస్యం తెలుసుకుంటాడు. భద్రం, లే!"

"ఏం?"

"పోతున్నాం!"

ఇద్దరం వీధిలోకి వచ్చాం. గబగబా

నడవసాగాం.
"ఎక్కడికి?" అన్నాడు భద్రం.
"మాట్లాడక రా."
మా పక్కగా ఒక టాక్సీ వెళ్ళింది. అందులో ఎవడో కూచుని ఉన్నాడు. నాకు మొహం కనిపించకుండా అటు తిరిగాడు.
"భద్రం, ఆ టాక్సీ నెంబరు రాసుకో."
టాక్సీలో నుంచి చుట్ట ఒకటి ఎగిరివచ్చి నేను చూస్తూండగానే రోడ్డుపక్క కందకంలో పడింది. అమాంతం కందకంలో దూకేశాను. కందకంలో మురుగున్నది. చుట్ట పైకి తీసి వాసన చూశాను. మురుగు వాసన.
"భద్రం, ఈ ఊళ్ళో ఈ మురుగుకంపు చుట్టలు ఏ దుకాణంలో అమ్ముతారో, తెలుసుకురా!" అన్నాను.
భద్రం వెళ్ళిపోయాడు.
హత్యలను గురించి, టాక్సీలో వెళ్ళినవాణ్ణి గురించీ, చుట్టల దుకాణం గురించీ ఆలోచిస్తూ నేను హోటలుకు తిరిగి వచ్చాను.
"మీకోసం పోలీసు వచ్చాడు. మీ గదిలో ఉన్నాడు," అని ఒక కుర్రాడు చెప్పాడు.
నా ఆనందానికి మేరలేదు. నేనీ కేసులో పనిచేస్తున్నట్టు సర్కిల్ షణ్ముగానికప్పుడే తెలిసిందన్నమాట! వాం



డ్రుపుల్! ఇది మహాలోతైన కేసు. అతనికెక్కడ అంతుపడుతుంది, ఆ దారుణ భయంకర రహస్యం? రహస్యం ఆ టాక్సీలో పోయిన వాడిలో ఉంది, మురుగు కాలవలో ఉంది.
"మీరేనా కె.సత్యానంద్‌గారు?" అన్నాడు పోలీసు.
"ఇన్‌స్పెక్టరుగారు రాలేదా?"
"వారు పనిమీద వున్నారు. మిమ్మల్ని తీసుకురమ్మన్నారు."
"నా అసిస్టెంటు లేడే?"
"తరువాత వాణ్ణి కూడా తీసుకొస్తాం. ముందు మీరు రండి."
ఇద్దరం కలిసి స్టేషనుకు వెళ్ళాం.
"గుడ్ మార్నింగ్, సర్కిల్ షణ్ముగంగారూ!" అన్నాను.
ఆ మానవుడు నాకేసి కొరకొరా చూశాడు - నేను హంతకుణ్ణి అయినట్టు. నాతో కొంచెం కూడా మర్యాదగా మాట్లాడలేదు. ఖైదీని అడిగినట్టు అన్నీ ప్రశ్నలు వేసి ఆఖరుకు "నువ్వు మీ బావమరిది ఇంట్లో రెండు వేలు ఎత్తుకొచ్చిన మాట నిజమేనా?" అన్నాడు.
ఇది ఎవరో నా విరోధి డిటెక్టివు చేస్తున్న పనే. ప్రస్తుతానికి నన్ను లాకప్‌లో పెట్టారు. కాని బయటికి వస్తూనే విరోధి సంగతి తేలుస్తాను.
■

# తొలి 'వలపు'లు

## ఆర్.కె.నారాయణ్ జ్ఞాపకం

ఎదురింటి బాల్కనీలోంచి కనిపించే అందమైన అమ్మాయి మోమును చూడటం నిట్టూర్పు వదలడం- బాల్కనీ అమ్మాయి కాకపోతే వీధిలో పోతూ కనిపించే మరో అమ్మాయి- కాకుంటే జనం మధ్యలోంచి కనిపించే ఇంకో అమ్మాయి...ఇలా అమ్మాయిలను చూస్తూ ప్రేమకోసం తపించేవాడిని. కాలేజీకి వెళ్లే రోజుల్లో ప్రధాన వ్యాపకమిదే. ఆ రోజుల్లోని సామాజిక పరిస్థితులు కూడా నాలాంటి లేతమనసు ప్రేమికుల్ని బాధించేవి. అమ్మాయిలు అబ్బాయిలు మాట్లాడుకోకూడదు. చెల్లెలు తప్ప మనతో మరో అమ్మాయి మాట్లాడటమన్నది ఊహించుకోవటమే కష్టంగా ఉండేది. ఒక దశలో ప్రేమజ్వరంతో బాగా బాధపడ్డాను. కల్పనా సాహిత్యం బాగా చదవడంతో ఈ ప్రేమగుణం మరీ ఎక్కువైంది. అంతా ఒక వైపు ప్రేమనే (ఒన్‌సైడెడ్) అనుకోండి! ఏ అమ్మాయైనా కళ్లెత్తి చూసిందంటే... చాలు ఇక ఆ అమ్మాయే నా స్వీట్‌హార్ట్. అదెంతకాలం? మరో అమ్మాయి కనిపించేంత వరకే! ఒకసారి కోలమొహం అమ్మాయి ప్రేమలో పడ్డాను. మా పక్క వీధిలో వుండే ఇంజనీరుగారి మరదలు ఆమె. రోజులో ఏదైనా మిస్ అయ్యే వాడినేమో గానీ, ఆ అమ్మాయి కడగంటి చూపును మటుకు 'మిస్' అయ్యేవాడిని కాను. ఒక్కొక్కసారి ఆ అమ్మాయిని అనుసరించి బానిసలాగా వెళ్లే వాడిని. ఆమె వాళ్ల ఇంటి గేటు తెరుచుకుని



ఇంట్లోకి అదృశ్యమయ్యేంత వరకు వెనకే నడిచేవాడిని. ఇంట్లోకి వెళుతూ ఒక్కసారి చూస్తుందన్న ఆశ అలా ఎప్పుడూ జరగలేదు. రాత్రింబవళ్లు ఆమెనే కలవరించేవాడిని. ఉన్నట్టుండి ఓ రోజున ఆ అమ్మాయి వెళ్లిపోయింది. ఒక రోజు కాలేజీకి వెళుతుంటే ఓ ఇంటి బాల్కనీపైన జుట్టు ఆరబోసుకుంటూ ఒకమ్మాయి కనిపించింది. నావైపు చూసినట్టనిపించి ప్రేమలో పడ్డాను. ఆ అమ్మాయి పొట్టిగా...బొద్దుగా వుండేది. అయితేనా ప్రేమ విషయంలో మటుకు ఎలాంటి తేడాలేదు. కానీ ఎందుకో నాకు ఆ అమ్మాయి ఆ వీధిన వెళ్లే అబ్బాయిలందరికేసి క్రీగంట చూస్తుందని అనిపించింది. ఆ ఆలోచన రాగానే ఆమె మీద ఇంట్రెస్ట్ పోయింది. నా ప్రేమను మరో అమ్మాయికేసి మళ్లించాను. మహరాణి కాలేజీకి వెళ్లే ఆ అమ్మాయి నాకేసి చూసి నవ్వుతూ వెళుతుండేది. అంతే మళ్లీ ప్రేమ మొదలు. అటువైపు నుంచి రెస్పాన్స్ అవసరమనిపించేది కాదు. ఒన్‌వే లవ్ స్టార్ట్! ఈ అమ్మాయి దృష్టి నా మీద పడటం ఎంతో అదృష్టమనిపించింది. మా స్నేహ బృందంలో మరీ సన్నిహితులం అమ్మాయిల గురించి మాట్లాడుకుంటుండే వాళ్లం. జోకులు వేసుకుని పగలబడి నవ్వుకుంటుండే వాళ్లం. నా ప్రేమ మరీ పరిమితులు దాటేది. ఒకసారి ఒక లేడీ డాక్టర్ ప్రేమలో పడ్డాను, ఆ బ్రిటిషు వైద్యురాలు జబ్బుపడ్డ మా అమ్మను చూడటానికి వచ్చేది. ఆమె ఒకటి రెండు సార్లు నాతో మాట్లాడింది. అంతే నా మనసు గింగిరాలు తిరిగింది. పెళ్లయిన, ఆ లావుపాటి మధ్య వయస్కురాలి ప్రేమలో పడిపోయాను. ఒన్‌వే - ప్రేమకు హద్దులు, వయసు తేడాలు ఏవి వుండవు.

నేను మరీ ఇదిగా ప్రేమించిన అమ్మా లండన్‌లో వుండేది. ఆమె నాపెన్‌ఫ్రెండ్. నాకు ఓ ఫోటో పంపింది. నేనూ నా ఫోటోపంపాను. ఆ అమ్మాయి ఫోటోను నేను నా గుండె మీది జేబులో పెట్టుకునే వాడిని. ఆ అమ్మాయిని కూడా నా ఫోటోను అలాగే పెట్టుకుంటుందని ఆశించేవాణ్ణి. నాకు ఆ అమ్మాయికి మధ్య దూరం ఐదువేల మైళ్లు. అయితేనేం-ఆ అమ్మాయి నేను ప్రేమించినట్టుగానే తను నన్ను ప్రేమిస్తుంటుందని గట్టి నమ్మకం వుండేది. ఆమెకు పే లకొద్దీ ప్రేమలేఖలు రాసేవాడిని. ఆ అమ్మాయి మటుకు జవాబుగా తన హాలీడే టూర్‌గురించో, స్టాంపుల సేకరణగురించో రాసేది. నా ప్రేమను ఖండించేది. అయితే, ఉత్తరాలు రాయడం మటుకు మానేది కాదు. దాంతో ఎప్పటికైనా నన్ను ప్రేమించితీరుతుందన్న ఆశకలిగేది. ఆ నమ్మకంతో, రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని ప్రేమలేఖలు రాసేవాడిని. ఆమె నాకు రాసే లేఖలను...ఇతర గిఫ్ట్‌లను సంవత్సరాల తరబడి భద్రపరచుకుని మురిసిపోయాను.

నాకు పెళ్లయ్యేంతవరకు ఈ తతంగం కొనసాగింది. పెళ్లవగానే ఆ ఉత్తరాలను పారేశాను. అన్నట్టు -నేను నా శ్రీమతి రాజ్యంనుకూడా ప్రేమించాను సుమా! కాకుంటే ఈసారి గట్టిప్రయత్నంచేసి అటు ఇటు వారిని ఒప్పించి పెళ్లిచేసుకున్నాను.

-'మై డేస్ నుంచి'